


# కరపత్రం

SINCE 2014

ఆదివారం మే 31, 2026 | సంపుటి : 2 | సంచిక : 229 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్:
కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ధాన్యం సేకరణ అధ్వానంగా ఉందన్నారు.

2 లో

# మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

## ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పకుంటా



- లేఏకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా
- రైతుల ముసుగులో లబ్ధికి కెసిఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బిజెపి ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- హరీశ్‌రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మే30 :**
తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ది కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ది కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు.

మిగతాద్ది 2 లో



# పట్టణ పేదలకు పెద్దన్నరేవంత్ రెడ్డి కానుక

- తొలి విడతగా లక్ష, మలి విడత మరో లక్ష ఇళ్ల నిర్మాణం
- ఏడాదిలోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- పేదవాని గుమ్మం వద్దకు ప్రజా ప్రభుత్వ పథకాలు
- ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,మే30 :**
పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. శనివారం నాడు బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఇళ్లు 30-40 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని , ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని అన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు.

మిగతాద్ది 2 లో



## బాల్క సుమన్ వ్యాఖ్యలు దుర్మార్గం

- అందుదే అరెస్ట్ చేసిన పోలీసులు
- బల్క వెనక కెసిఆర్ కుట్ర దాగివుంది
- మీడియాతో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

**హైదరాబాద్,మే30 :**
బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి కారణం ఆయన మాటలేనని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గాంధీభవన్ లో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడుతూ...

## తెలుగు రాష్ట్రాల్లో తగ్గని ఎండల తీవ్రత

» ఎల్‌నినోతో ఆలస్యం కానున్న రుతుపవనాలు

**హైదరాబాద్,మే30 :**
తెలుగు రాష్ట్రాల్లో ఎండలకు తోడు, వడగాలులు కూడా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అడపాదడపా కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు పడుతున్నా, మొత్తంగా ఎండలు మాత్రం శాంతించడం లేదు. రుతుపవానలు కూడా ఆలస్యం అవుతున్నాయి.



2లో..

## బిఆర్ఎస్ నేతలవి దుర్మార్గపు ఆలోచనలు

.అందులో భాగంగానే బాల్క వ్యాఖ్యలు .మండిపడ్డ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్,మే30 :**
బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామాలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బలయ్యాడని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. ఇటీవల కాలంలో బీఆర్ఎస్ నాయకులు వాడుతున్న భాష, చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ అగ్రనాయకత్వం అనుసరిస్తున్న రాజకీయ శైలిపై, వారి అణచివేత ధోరణిపై నిప్పులు చెరిగారు.



2 లో




## సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు

- కేసు పెట్టి అరెస్ట్ చేసిన పోలీసులు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటానన్న బాల్క

**హైదరాబాద్,మే30 ):**
బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బాల్క సుమన్‌ను నాంపల్లి కోర్టుకు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేయడానికి ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను ఎక్కడికీ పారిపోలేదు. తెలంగాణ భవన్‌లోనే ఉన్నా. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టారు.

మిగతాద్ది 2 లో



2లో..

## రైతులకు వాతావరణ సూచనలు

» తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం
» ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్,మే30 :**
రాష్ట్రంలోని రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం, శాస్త్రీయ వ్యవసాయ సూచనలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమంను రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికారికంగా ప్రారంభించారు. తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా (డీఐఎల్ ఇండియా), ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

## పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

- సిబిఎస్ఇ మూల్యంకలనంలో లోపాలు దారుణం
- అసమర్థ వ్యవస్థలపై దేశాన్ని నిర్మించలేమన్న కెటిఆర్
- విద్యార్థులకు అండగా పోరాడుతామని ప్రకటన



**హైదరాబాద్,మే30 :**
దేశంలో నీట్ పరీక్షల అక్రమాలపై రేగిన వివాదం ఇంకా చల్లబడకముందే, భారతీయ విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను మరింత మసకబారుస్తూ సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవలే విడుదలైన సీబీఎస్ఈ ఫలితాలలో డిజిటల్ మూల్యాంకనం లోపాల కారణంగా తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ మార్కుల తారుమారు వ్యవహారం దేశవ్యాప్తంగా దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనలో ముంచెత్తింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. న్యాయం కోసం ఉధృతంగా పోరాడుతున్న విద్యార్థులకు తన పూర్తి మద్దతును ప్రకటిస్తూ.. దేశ భవిష్యత్తును ఇలాంటి కుళ్ళిన, అసమర్థ వ్యవస్థల మీద ఎంతమాత్రం నిర్మించలేమని హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంలో గతంలో తెలంగాణను కుదిపేసిన ఒక చేదు జ్ఞాపకం మళ్లీ తెరపైకి వచ్చిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.

మిగతాది 2లో



2లో..

## తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

- జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం
- కేశవరావు కమిటీ తొలి భేటీ

**హైదరాబాద్,మే30 :**
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం మే 31, 2026

## తెలుగు రాష్ట్రాల్లో తగ్గని ఎండల తీవ్రత

మొదటి పేజీ తరువాయి
పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావంతోజూన్ 1 నుంచి అక్టోబర్ వరకు నైరుతి సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు లేవని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో భిన్నవాతావరణం కొనసాగుతున్నది. తెల్లవారుజామున, రాత్రివేళలో వర్షం కురుస్తుండగా.. మిగతా సమయంలో ఎండలు దంచికొడుతున్నాయి. 17 జిల్లాల్లో 45 డిగ్రీలకుపై గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో వర్షపాతం కొద్దిగా ఆశించినస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. వాతావరణంలో నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకొంటూ, పంటల ప్రణాళికలను రూపొందించుకోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. 2026 నైరుతి రుతుపవనాల కాలానికి సంబంధించిన తుది దీర్ఘకాలిక వాతావరణ అంచనాలను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు మధ్య తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్టు వెల్లడించింది. ఈ వర్షాలు భూగర్భ జలవనరుల పునరుద్ధరణకు ఎంతో ఉపయోగపడుతాయని వివరించింది. సంవత్సరం వానకాలం ఎల్‌నినో ప్రభావంతో 2018 మాదిరిగానే ఉంటుందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. 2025 సంవత్సరం మాదిరి వర్షాలను ఆశించవద్దని తెలంగాణ వెదర్‌మ్యాన్ సూచించారు. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షాలు ఉంటాయని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణంకంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అంచనా వేశారు. అయినప్పటికీ.. 2014-15లా సాధారణ వర్షపాతం 905.4 మి.మీ. కురువాల్సి ఉండగా కేవలం 562.1 మి.మీ. కురిసినంత తీవ్రంగా ఉండకపోవచ్చని తెలిపారు. గత 5-6 సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం రుతుపవన వర్షాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఏడాది దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల లోటు తీవ్రంగా ఉంటుందని, మధ్య తెలంగాణలో మంచి వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఈ ఏడాది రెండో వారంలో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ఆరంభం ఉంటుందని చెప్పారు.

## సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి
క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ నన్ను జైల్లో పెట్టారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను టార్గెట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. దానినే ప్రశ్నించా. మరోసారి నన్ను జైలుకు పంపాలని రేవంత్, వివేక్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నన్ను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు. బాల్క సుమన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఆనంద్ అనే వ్యక్తి బాల్క సుమన్‌పై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. 'సింగరేణిని తగలపెట్టండి. మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. ఆఫీస్‌లను తగలబెడదాం. నెల రోజులు జైలుకు పోయి వస్తాము' అని బాల్క సుమన్ కామెంట్లు చేసినట్లు ఆనంద్ తెలిపాడు.

## బాల్క సుమన్ వ్యాఖ్యలు దుర్మార్గం

మొదటి పేజీ తరువాయి
బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి ఆయన మాటలే కారణం. సుమన్ వ్యాఖ్యల వెనక కేసీఆర్ కుట్ర ఉంది. మీకు కోపం ఉంటే మాపై దాడి చేయండి. సామాన్య ప్రజలు తిరిగే రైళ్లపై మీకు ఎందుకు అంత అక్కసు. రైళ్లలో తిరిగేది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదలే. మీకు ఓట్లేయలేదని పెదలపై కోపమా?. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేనూ నిరసన కార్యక్రమాలు చేశాను. మేం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేశాము' అని వెంకట్ అన్నారు.బీఆర్‌ఎస్ పార్టీ నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. ఆయన మాటలకు కౌంటర్ గా ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ స్పందించారు. కేసీఆర్ ఒకయానికి డ్రగ్ శాఖ ఇచ్చాడు. మరొకరికి పిచ్చోడిలా వాగే శాఖ ఇచ్చాడు. సుమన్‌కి రైలు పట్టాలు కోసే శాఖ ఇచ్చాడు. బీఆర్ఎస్ పార్టీని ఎవరూ పట్టించుకోవడం లేదు. తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలని కేసీఆర్ కుట్ర చేస్తున్నారు. సుమన్ లాంటి వ్యక్తులపై పీడీ యాక్ట్ పెట్టాలి' అంటూ బల్మూరి వెంకట్గ్ ÷ర్ అయ్యారు.

## రైతులకు వాతావరణ సూచనలు

మొదటి పేజీ తరువాయి
ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా మరియు ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.

ఈ సందర్భంగా ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ కంట్రీ డైరెక్టర్ శ్రీ అంకుర్ గర్ న్యూఢిల్లీ నుండి జూమ్ ద్వారా పాల్గొని, తమ సంస్థ రైతుల కోసం కృత్రిమ మేధస్సు ఆధారంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను మంత్రి గారికి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది తెలంగాణ రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి మరియు ప్రత్యేకంగా మంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి భవిష్యత్తులో మరిన్ని సేవలను రైతులకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి సవాళ్లుగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఖచ్చితమైన, సమయానుకూల వాతావరణ సమాచారం అందించడం అత్యంత అవసరమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రైతులకు క్షేత్రస్థాయిలో ఉపయోగపడే సూచనలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం: కిషన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి
దళారీలు, అధికారులు, ప్రభుత్వం మధ్య రైతులు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భాజపా చేపట్టిన బస్సు యాత్రతోనే రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. 'కేంద్రం ధాన్యం తీసుకోవట్లేదని ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్నారు.. ధాన్యం సేకరణ రాష్ట్ర ప్రభుత్వం పని' అని స్పష్టం చేశారు. ఖరీఫ్‌లో 58.96లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని కేంద్రం, రాష్ట్రం మధ్య ఒప్పందం కుదిరిందని వివరించారు. కమీషన్లు, రియల్ ఎస్టేట్‌పైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేదని ఎద్దేవా చేశారు.

## పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

మొదటి పేజీ తరువాయి
2019లో తెలంగాణలో ఇంటర్మీడియట్ ఫలితాలను అస్తవ్యస్తం చేసి, పలువురు విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన 'గ్లోబరేనా' సంస్థే ఇప్పుడు కేవలం తన పేరును మార్చుకుని, సీబీఎస్ఈ నుంచి అంతకంటే పెద్ద కాంట్రాక్ట్‌ను దక్కించుకోవడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. కేంద్ర బోర్డు నిర్లక్ష్యం వల్లే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇంత పెద్ద గందరగోళం నెలకొందని విమర్శించారు.

నాడు గ్లోబరేనా వ్యవహారంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిం చిందని కేటీఆర్ గుర్తుచేశారు. లోపాలను వెలికితీసేందుకు తక్షణమే ముగ్గురు నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తప్పు చేసిన సంబంధిత అధికారులను పదవుల నుంచి తక్షణమే తొలగించామని కేటీఆర్ వివరించారు. అంతేకాకుండా, బాధ్యురాలైన సదరు సంస్థపై కోర్టులో చట్టపరమైన క్రిమినల్ చర్యలు కూడా తీసుకున్నామని ప్రస్తావించారు. ఇంతటి చెడ్డ పేరు ఉన్న ఒక అసమర్థ సంస్థను సీబీఎస్ఈ బోర్డు ఎలా నమ్మిందని కేటీఆర్ ప్రశ్నించారు. కేవలం ఆ సంస్థకు లబ్ధి చేకూర్చేందుకే బోర్డు తన నిబంధనలను పదే పదే మార్చిందని ఆయన ఆరోపించారు. ఒక చిన్న పేరు మార్పు ప్రక్రియతో పాత తప్పులను దాచిపెట్టి, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో, భవిష్యత్తుతో ఆడుకోవడం క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. నిరుద్యోగం, పరీక్షల లీకేజీలు, తప్పుడు మూల్యాంకనాలతో దేశంలోని విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నారని, లక్షలాది మంది మానసిక క్షోభకు కారణమైన ఈ మార్కుల వివాదానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి కచ్చితంగా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. బాధితులైన విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడుతుందని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్ నేతలవి దుర్మార్గపు ఆలోచనలు

మొదటి పేజీ తరువాయి
ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. 'బాల్క సుమన్‌తో ఎవరు మాట్లాడించారో కూడా తెలియాలి. పట్టాలు కోయాలని, దాడులు చేయాలని పిలుపునివ్వడం పూర్తిగా బీఆర్ఎస్ సంస్కృతి. ఇది ముమ్మాటికీ కేసీఆర్ నైజం. ఆయనకు తెలిసిన రాజకీయ నీతి ఇదే. కేసీఆర్ తనకు తెలిసిన కుటిల రాజకీయాన్నే కొడుకు కేటీఆర్‌కు నేర్పించారు. కేటీఆర్ తనకు తెలిసిన ఆ నీతినే బాల్క సుమన్‌కు నూరిపోశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ తప్పులు చేసి, దాన్ని ప్రశ్నిస్తే జై తెలంగాణ అంటారు. ఫార్ములా రేస్ నిధుల దుర్వినియోగంపై విచారణకు వెళ్తూ కూడా కేటీఆర్ జై తెలంగాణ అంటారు. తప్పులు చేసి వాటిని గొప్పగా చెప్పుకోవడం బీఆర్ఎస్ నేతలకే చెల్లింది. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగ సంఘాలు, చివరకు రైతులను కూడా రెచ్చగొట్టడమే ఏకైక ఎజెండాగా పెట్టుకున్న బీఆర్ఎస్ నాయకులు.. అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారు. సుమన్‌తో మాట్లాడించింది ఎవరో పోలీస్ అధికారులు విచారణ చేయాలని అన్నారు.ఇలాంటి దుర్మార్గపు ఆలోచనల నుండి బిఆర్ఎస్ నేతలు బయటకు రావాలన్నారు.

## మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

మొదటి పేజీ తరువాయి
బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధ్యాన్యం కొనకపోతే భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన దిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

## పట్టణ పేదలకు పెద్దన్నరేవంత్ రెడ్డి కానుక

మొదటి పేజీ తరువాయి
తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ - గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వందలాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ అనీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

మొదటి పేజీ తరువాయి
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన జివో .679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది. జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని

అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్ లు, విద్యార్థులు, ఆర్.టి.సి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## మోసపు హామీలతో గద్దెనెక్కి దగా
## కాంగ్రెస్ పాలనలో రైతులు మోసపోయారు

- బిజెపి ప్రజల్లోకి వెళితే తప్ప ప్రభుత్వం మేల్కోలేదు
- కేంద్రాన్ని విమర్శించడం తప్ప చేసిందేమీ లేదు
- మీడియా సమావేశంలో మండిపడ్డ కిషన్ రెడ్డి

మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా దళారులు, ప్రభుత్వం, రైస్ మిల్లర్ల చేతిలో రైతులు విలవిల్లాడుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మంత్రులు ఏసీ రూముల్లో గడిపారని.. తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతుల దగ్గరికి వెళ్ళే వరకు మేలుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం గతంలో ఎలా ఉండేదో ఇప్పుడు అలానే ఉందని విమర్శించారు. రైతుల దగ్గర నుంచి కేంద్రం నేరుగా కొనదు.. మీ దద్దమ్మ తనం కేంద్రం మీద మోపుతున్నారని మండిపడ్డారు. దొడ్డు బియ్యం పండించే రైతుల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రైతులతో ఆడుకుంటున్నాయని.. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమిషన్లు, భూ దందాల మీద ఉన్న దృష్టి రైతుల మీద లేదని విమర్శించారు. ఆ మంత్రి ఎంత ఈ మంత్రి ఎంత కమిషన్ తీసుకున్నారు.. నేనెంత తీసుకోవాలని చర్చిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ వ్యాప్తంగా విపరీతంగా ధాన్యం ఉత్పత్తి జరిగిందని.. ఎక్కడ గోదాంలు ఖాళీగా లేవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 'విదేశాలకు సప్లై చేయాలి అంటే ఫెస్టిసైడ్ వాడ కూడదు. క్షేత్ర స్థాయిలో ఆర్గానిక్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పిస్తుందా? రైతుల ఉసురు తీసుకుంటుంది ఈ ప్రభుత్వం.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ సమస్య ఎందుకు లేదు. 6 నెలల ముందు గన్ని బస్తాలు తెచ్చుకుంటే ఏమయ్యింది. ఇక్కడ పండే సన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్నారు. ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. తక్కువ ధరకు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ నాశి రకం సన్న బియ్యాన్ని పేద ప్రజలకి అందిస్తున్నారు. పేదలను, రైతులను మోసం చేస్తున్నారు. అందరికీ కేంద్రాన్ని విమర్శించడం అలవాటు అయింది. ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణ నుంచి కేంద్రం తీసుకుంది. ఈ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని అనుకుంటుంది. ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రధాని పదేపదే చెపుతున్నారు. ధాన్యం సేకరణపై కేంద్రం గతంలో 9 సార్లు పొడిగింపు ఇచ్చింది. ఎప్పుడూ ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయలేదు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారు. గతంలో బీర్ఎస్ అదే పని చేసింది. కేంద్రం ఇప్పటి వరకు ఇచ్చిన కోటను పూర్తి చేయలేదు. 52.24 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రంతో ఒప్పందం జరిగింది. ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు.

## విజయవాడ హైవేపై బస్సు దగ్ధం
## తృటిలో తప్పిన పెద్ద ప్రమాదం

**బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితం**

హైదరాబాద్-విజయవాడ హైవేపై మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో శనివారం తెల్లవారుజామున ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతైంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న రెయిన్‌బో ట్రావెల్స్‌కు చెందిన బస్సులో మంటలు చెలరేగగా.. ప్రమాద సమయంలో 36 మంది ప్రయాణికులు బస్సులో ఉండగా.. అందరూ సురక్షితంగా బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణ మధ్యలో బస్సు ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పరిస్థితిని వెంటనే గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును రోడ్డుపక్కన నిలిపివేసి ప్రయాణికులను వెంటనే దిగిపోవాలని హెచ్చరించాడు. దీంతో ప్రయాణికులంతా సురక్షితంగా బయటకు వచ్చారు. అయితే కొద్దిసేపటికే మంటలు బస్సు అంతటా వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించింది. బస్సులో మంటలు చెలరేగడానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

## ఎసిబికి చిక్కిన సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్
## 4 లక్షల లంచం తీసుకుంటుండగా పట్టివేత

సైబర్ నేరగాళ్ల ఆట కట్టించాల్సిన పోలీసే అడ్డంగా లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కాడు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బత్తుల మహేందర్ లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ పట్టుబడ్డాడు. ఒక సైబర్ మోసం కేసులో బాధితుడి కుటుంబ సభ్యులను ఇరికించకుండా ఉండాలంటే... ఏకంగా 9 లక్షల రూపాయలు లంచం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ మహేందర్ డిమాండ్ చేశాడు. ఇందులో భాగంగా బాధితుడి నుంచి ఇప్పటికే ఐదు లక్షల రూపాయల నగదును గుట్టుచప్పుడు కాకుండా వసూలు చేశాడు. మిగిలిన 4 లక్షల రూపాయల కోసం బాధితుడిని మరోసారి బెదిరింపులకు గురిచేశాడు. దీనితో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పక్కా ప్లాన్ ప్రకారం...శనివారం ఇన్‌స్పెక్టర్ మహేందర్ మిగిలిన 4 లక్షల రూపాయల లంచం డబ్బును తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ అరెస్ట్ అనంతరం అతడి అధికారిక నివాసంలో ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లెక్కల్లో చూపని 13 లక్షల రూపాయల భారీ నగదుతో పాటు, పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు, కీలకమైన ఆస్తి పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ు

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం మే 31, 2026

# సివిల్ కేసులో మేడ్చల్ ఎస్ఐ,సిఐ దౌర్జన్యం

## దరఖాస్తు ఇవ్వడానికి వెళితే బాధితుని కాలు విరగొట్టిన పోలీసులు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ మండలంలోని మైసిరెడ్డిపల్లి గ్రామంలో ఒక భూమి వివాదంలో పోలీస్ స్టేషన్ కు స్వయంగా వెళ్లిన మల్లిగారి ప్రదీప్ ను, అతడిని తీసుకొని వెళ్లిన మాజీ సర్పంచ్ మల్లిగారి కరుణాకర్ ను ఎస్ ఐ సురేష్ అకారణంగా కొట్టిన వైనం ఇప్పుడు మేడ్చల్ మండలంలో హల్చల్ రేపుతున్నది.29 మే 2026 శుక్రవారం రోజున మైసిరెడ్డిపల్లి గ్రామంలోని భూమి సర్వే నంబర్ 114 లో జార్జ్ అనే వ్యక్తి అతని భార్య కొడుకుతో కలిసి అక్రమంగా పనులు చేస్తున్నాడని తెలుసుకొని మల్లిగారి దేవదానం అనే వ్యక్తి ఆ భూమిలోనికి వెళ్లి అందులో పని చేస్తున్న జెసిబి ని ఆపాలని డ్రైవర్ ను కోరాడు.జార్జ్ అనే వ్యక్తితో పాటు అతని భార్య సంతోషి కొడుకు మధుకర్ లు దేవదానం ను కొట్టడం ప్రారంభించారు.దేవదానం ఒక్కడే వెళ్ళాడు అని, ఏ గొడవ జరుగుతుందో అని భయపడ్డ దేవదానం భార్య మరియు కొడుకు ప్రదీప్ కలిసి ఆ స్థలం వద్దకు వెళ్లారు. వీళ్లు వెళ్ళేసరికి గొడవ జరుగుతున్నది.తమ తండ్రి దేవదానం ను కొడుతున్నారని ప్రదీప్ జోక్యం చేసుకోవడం జరిగింది. ప్రదీప్ జార్జ్ తో కలబడడం కూడా జరిగింది. అప్పటికే కారం పొడి చల్లుతూ జార్జ్, దేవదానం తోపులాడుకున్నారు.

### అసలు ఆ స్థలం ఎవరిది?

జార్జ్ తండ్రి మైసయ్య మైసిరెడ్డిపల్లి లోని 114 సర్వేనెంబర్ లోని భూమిని దేవదానం భార్య లక్ష్మి కి అమ్మి భూమి రిజిస్టర్ కూడా చేశాడు. ఆ భూమి యజమాని దేవదానం భార్య లక్ష్మి.మైసయ్య అమ్మిన భూమి బాపతు రిజిస్టర్డ్ డాక్యుమెంట్ కూడా దేవదానం భార్య లక్ష్మి వద్ద ఉంది. కానీ అసైన్డ్ భూమి కావడం వలన మైసయ్య పేరు మీద ఉన్న భూమి అతని కొడుకు జార్జ్ పేరుమీద మ్యుటేషన్ జరిగింది. ఆ భూమి మల్లిగారి లక్ష్మి పేరు మీద మారలేదు.న్యాయ అన్యాయాలను మరిచిన జార్జ్ ఇట్టి స్థలాన్ని వేరే ఒకరికి అమ్మాడు. అసైన్డ్ భూమి కావడం వలన జార్జ్ వద్ద కొన్న వ్యక్తి పేరు పై కూడా భూమి పేరు మారలేదు.ఈ భూమి విషయం లో గతంలో ఒకసారి గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని ఈ భూమి దేవదానంకు చెందినది కదా, అతనికి అప్పగించాలని జార్జ్ ను ఆదేశించారు.

**దేవదానం తన భార్య పేరు మీద రిజిస్టర్ చేసుకున్నాడు కదా.. పేరు మార్చుకోమను నాకు అభ్యంతరం లేదు అని జార్జ్ వంకర మాటలు మాట్లాడాడు.**

- **అది అసైన్డ్ భూమి కావడం వలన చట్ట ప్రకారము పేరు మార్పిడి జరుగుతుంది. ఈ విషయాల్లో జరుగుతున్న ఆలస్యాన్ని, చట్టపరమైన సాంకేతిక అంశాలను దృష్టిలో పెట్టుకున్న జార్జ్ అట్టి స్థలం పైకి అక్రమంగా వచ్చి కబ్జాలో ఉంచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు**

సర్వేనెంబర్ 114 తన భూమి అనే హక్కుతో దేవదానం స్థలం పైకి వెళితే జార్జ్ దౌర్జన్యం చేస్తున్నాడు.

**ఈ సివిల్ మ్యాటర్ లో అసలు విషయం తెలియని పోలీసులు జార్జ్ కు మద్దతునిచ్చారు**

దేవదానం, ప్రదీప్ ల భూమి హక్కులకు పోలీసులు భంగం కలిగిస్తున్నారు.ఇట్టి భూమి జార్జ్ పేరున ఉంది అని బహుశా పోలీసులు భావిస్తున్నట్టు ఉన్నారు.పోలీసులు సివిల్ విషయాలలో జోక్యం చేసుకోవద్దు అని పై అధికారులు ఎంత చెప్పినా.. పోలీసు స్టేషన్ లలో తాటికాయంత అక్షరాలతో బోర్డులు రాసిపెట్టినా... అవన్నీ నీటి మీద రాతలే అయిపోయాయి.

### మేడ్చల్ సిఐ అధికార పార్టీ ఏజెంట్ గా మారాడు

మేడ్చల్ పోలీసు స్టేషన్ లో సిఐ గా పని చేస్తున్న సత్యనారాయణ గారు మొదటి నుండి అధికార పార్టీ పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారు.న్యాయ అన్యాయ విచక్షణలు అతనికి లేవు. అధికారం లో ఉన్న నాయకులు చెప్పిందే చట్టం. అతను చేసిందే న్యాయం.

- **29 మే 2026 రోజు సాయంత్రం మైసిరెడ్డిపల్లిలో గొడవ జరిగిందని ఫోన్ అందుకున్న కరుణాకర్ స్థలానికి వెళ్ళాడు. గ్రామ నాయకుడిగా గొడవ జరగకూడదు అని నచ్చజెప్పి తన తమ్ము డైన ప్రదీప్ ను తీసుకొని సాయంత్రం 6:30 గంటలకు స్వయంగా పోలీసు స్టేషన్ కు వెళ్ళాడు.**

సంబంధిత ఎస్సై సురేష్ గారికి తన పరిచయం చేసుకొని మాట్లాడే ప్రయత్నం చేస్తుంటే అవకాశం ఇవ్వకుండా.. ఎస్ఐ సురేష్ లేచి కరుణాకర్ ను చేతులతో చంపలపై కొట్టాడు. కరుణాకర్ ఎస్సైని వారించి విషయం చెప్పే ప్రయత్నం చేస్తే కూడా వినలేదు.నీ పక్కన ఉన్నది ఎవడు రా అని అంటూ,ప్రదీప్ తన పేరు చెప్పే లోపే.. నువ్వేనారా గొడవ చేసింది అంటూ ఎస్ఐ సురేష్ కరుణాకర్ తమ్ముడు ప్రదీప్ ను చేతులతో పిడి గుద్దులు కురిపించాడు.

**ఎస్ఐ సురేష్ కరుణాకర్ ఫోన్ ను అతని తమ్ముడు ప్రదీప్ ఫోన్ ను లాక్కొని లోపల పెట్టేసుకున్నాడు**

ఏ సమాచారం కొరకు ఎస్ఐ ఫోన్ లు లాక్కున్నాడు. ఫోన్ లు లాక్కోవడం డ్యూటీలో భాగమా?
లాక్కున్న ఫోన్లు పోలీసులు తిరిగి ఇస్తారా ఇవ్వరా? ఫోన్ల కోసం పోలీసు స్టేషన్ కు వెళితే బేర సారాలు చేయవచ్చు అనే ఉద్దేశంతో ఫోన్ లు లాక్కున్నారా? ఇది చట్టబద్ధమేనా?

**అదే సమయానికి పోలీస్ స్టేషన్ కు వచ్చిన స్టేషన్ హౌస్ అధికారి సిఐ సత్యనారాయణ గారు విషయము వినకుండా, విచారణ చేయకుండా**



**కరుణాకర్ ను పక్కకు నెట్టివేసి అతడి తమ్ముడు ప్రదీప్ ను కొట్టడం ప్రారంభించారు.**

సిఐ వారికి ఆదేశాలిస్తూ వీడి సంగతి చూడండి అని అనగానే ప్రదీప్ ను నేలపై పడదోసి, లాగి కూర్చోబెట్టి వీపును గోడకు ఆనించి కాళ్లు చాపి కానిస్టేబుల్ ప్రదీప్ కరుణాకర్ తమ్ముడి రెండు కాళ్ళ పైన నిలుచున్నాడు.ఎస్ఐ సురేష్ టైరుతో కర్రతో కరుణాకర్ తమ్ముడి ప్రదీప్ పాదాల పైన, కాళ్ళ పైన విపరీతంగా కొట్టాడు. నొప్పి భరించలేక ప్రదీప్ అరుస్తుంటే కనికరం లేకుండా తిడుతూ నాటకాలు ఆడుతున్నావా ల.... కొడకా అంటూ దుర్భాషలాడుతూ నిర్దాక్షిణ్యంగా హింసించారు.పోలీసులు చట్టాన్ని దుర్వినియోగపరుస్తుంటే ఏమీ చేయలేక కరుణాకర్ నిశ్చేష్టుడైపోయాడు.దెబ్బలు తాలలేక ప్రదీప్ పక్కకు పడిపోతే కొడుతూ లేపి నిల్చోబెట్టి నడువు నడువు అంటూ చేతులు పట్టుకొని కరుణాకర్ తమ్ముడు ప్రదీప్ ను పోలీసులు నడిపించే ప్రయత్నం చేశారు.నడవలేక ప్రదీప్ కూలబడిపోతున్నాడని గ్రహించిన పోలీసులు వెళ్లిపోండి మీరు వెళ్లిపోండి అంటూ కరుణాకరును అతని తమ్ముడు ప్రదీప్ ను పోలీస్ స్టేషన్ నుండి బయటకు గెంటేశారు.పైగా బెదిరిస్తూ, మీరు రేపు 30వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకల్లా పోలీస్ స్టేషన్ కు రావాలి.. లేకపోతే మీ పైన చార్జ్ షీట్ వేసి, రౌడీ షీట్ లు తెరిచి బొక్కలో వేస్తామని రాత్రి పదకొండు గంటలకు ప్రదీప్ ను వదిలేసారు.
నడవలేని స్థితిలో ఉన్న ప్రదీప్ ను తన వెహికల్ పైన ఎక్కించుకొని కరుణాకర్ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న టెస్లా డయాగ్నొస్టిక్ సెంటర్ కు తీసుకొని వెళ్ళాడు. ఎడమ కాలు యాంకిల్ చీలమండ వద్ద వాపును గమనించిన ల్యాబ్ సిబ్బంది కాలు ఎక్స్ రే తీశారు.
ప్రదీప్, కరుణాకర్ ఇచ్చిన ఫిర్యాదును పక్కన పడేసి కనీసం తగిన మర్యాద కూడా ఇవ్వని పోలీసులు, దెబ్బలు తిని నడవలేని స్థితిలో ఉన్న ప్రదీప్ ను నిర్దాక్షిణ్యంగా వదిలివేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి పంపాల్సిన బాధ్యతను పోలీసులు మరిచిపోయారు. గత్యంతరం లేక కరుణాకర్ తన తమ్ముడు ప్రదీప్ ను తీసుకొని ప్రైవేట్ హాస్పిటల్ లు తిరగాల్సిన గతి పట్టింది.

**చట్ట ప్రకారం ప్రదీప్ ఫిర్యాదు ను మెడికో లీగల్ కేసుగా నమోదు చేసుకుని బాధితుడిని గవర్నమెంట్ హాస్పిటల్ కు పంపి మెడికల్ సర్టిఫికెట్ పొందాల్సిన పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు. బాధితుడిని గాలికి వదిలేశారు.**

- **పోలీసులు మళ్లీ పోలీస్ స్టేషన్ కు రమ్మన్నారని, వెళితే కొడతారని భావించిన ప్రదీప్ తన అన్నను తీసుకొని తెలంగాణ మానవ హక్కుల కమీషన్ కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. హెచ్.ఆర్.సి లో మేడ్చల్ పోలీసుల పైన ఫిర్యాదు నమోదయింది.ఆపైన తెలంగాణ డిజిపి గారికి,సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కి, స్థానిక ఎసిపి, డిసిపి గారలకు ఫిర్యాదు కూడా చేశారు**

- **సాయంత్రం 6:30 నుండి రాత్రి 11 గంటల వరకు పోలీస్ స్టేషన్ లో జరిగిన ఈ మొత్తం సంఘటన, సిసి టీవీ ఫుటేజ్ లలో భద్రంగా ఉంటుంది. ఆ సీసీటీవీ ఫుటేజ్ లను స్వాధీనం చేసుకుని కేసు విచారణ జరపవలసిందిగా మానవ హక్కుల కమిషన్ కు, పోలీసు అధికారులకు సమర్పించిన ఫిర్యాదులలో మల్లిగారి ప్రదీప్ విజ్ఞప్తి చేశాడు**

- **ఆ సిసి టీవీ ఫుటేజ్ లతో మేడ్చల్ పోలీసుల దౌర్జన్యం మొత్తం బయటపడుతుంది**

### అధికార పార్టీ తొత్తు గా మారిన మేడ్చల్ సిఐ

- **మేడ్చల్ సిఐ గా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజు నుంచి సిఐ సత్యనారాయణ గారు పూర్తిగా అధికార పార్టీ నాయకులు చెప్పినట్టుగా ఆడుతున్నాడు**

- **ప్రభుత్వం అండ తనకు ఉన్నదని విర్రవీగి పోతున్నాడు. ఎన్నో సివిల్ మ్యాటర్ లలో జోక్యం చేసుకొని విషయాలను తారుమారు చేయడంలో నైపుణ్యం సంపాదించాడు**

గతంలో మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చాలా సివిల్ విషయాలలో సిఐ సత్యనారాయణ వ్యవహార శైలిపై ఎన్నో ఫిర్యాదులు వెళ్లాయి. కానీ వాటన్నిటిని తనకున్న అధికార అండతో కప్పిపుచ్చాడు. తన బదిలీలను ఆపుకుంటున్నాడు.

- **గతంలో మైసిరెడ్డిపల్లి గ్రామంలో ఒకసారి భూమి విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. సివిల్ విషయాలలో తనకు నచ్చని వారిని మాటిమాటికి పిలిపిస్తూ విసుగు తెప్పించడంలో సిఐ సత్యనారాయణ దిట్ట. మైసిరెడ్డిపల్లి లో ఈ భూమి విషయంలో ఇరువర్గాలను రెచ్చగొట్టి హింసాత్మకమైన చర్యలకు దిగేటట్టుగా రెచ్చగొడతాడు. విసిగిపోయిన వారు ఎదుటి పక్షం వారిపై చేయి చేసుకుంటే క్రిమినల్ కేసులు పెట్టి వారిని భూమి పైకి రాకుండా చేస్తాడు. అలా భూమి సమస్యను తన ఆధీనంలోకి తీసుకొని సెటిల్మెంట్లు చేస్తాడు.**

సీఐ సత్యనారాయణ తాజాగా ఇదే టెక్నిక్ తో రాజకీయ కార్యకర్త వేషం వేసుకొని చట్టాన్ని తన చేతిలోకి తీసుకున్నాడు.తన కింద పని చేసే సెక్టార్ ఎస్ఐలకు ఆదేశాలిస్తూ విషయాలను తారుమారు చేయించే సిఐ సత్యనారాయణ, ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ ప్రదీప్ పై చట్టపరమైన క్రిమినల్ కేసులు తీసుకోవాల్సిందిగా మల్లిగారి ప్రదీప్ మానవహక్కుల కమిషన్ కు, పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

- **సివిల్ విషయములో ఒక పక్షం వహించి సమస్యను క్రిమినల్ నేచర్ లోకి మళ్లించి అమాయకుల జీవితాలతో ఆడుకుంటున్న సిఐ సత్యనారాయణపై, కొత్తగా వచ్చిన సూపర్ పోలీస్ ఎస్ఐ సురేష్ పైన, దూకుడు కానిస్టేబుల్ ప్రదీప్ పైన తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.**

మల్లిగారి ప్రదీప్ కాలు ఫ్రాక్చర్ అయ్యేలా అమానుషంగా ప్రవర్తించి హింసించి కొట్టిన ఎస్ఐ సురేష్ పైన, కానిస్టేబుల్ ప్రదీప్ పైన, సిఐ సత్యనారాయణ పైన ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే న్యాయం లభించే వరకు పోరాడుతామని కరుణాకర్ అన్నారు.చట్ట పరిధిలో పౌర హక్కులను ఉపయోగించుకొని అన్ని రకాల ఆందోళనలు చేస్తామని కరుణాకర్ తెలిపారు.

**పవన్ కళ్యాణ్ ఒక సినిమాలో పోలీస్ స్టేషన్ కు "గబ్బర్ సింగ్ పోలీస్ స్టేషన్" అని రాసుకున్నట్టు, మేడ్చల్ పోలీస్ స్టేషన్ ను "సత్యనారాయణ పోలీస్ స్టేషన్" అని భావిస్తున్నాడని ఎందరో బాధితులు వాపోతున్నారు**

డబ్బులు ఇచ్చి జార్జ్ తండ్రి నుంచి భూమి కొనుక్కొని న్యాయంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న మల్లిగారి దేవదానం కుటుంబానికి అన్యాయం చేస్తున్న మేడ్చల్ పోలీసుల దౌర్జన్యం పట్ల అధికారులు సమగ్ర విచారణ చేయాలని,తమ తమ్ముడు ప్రదీప్ ను విచక్షణారహితంగా కొట్టిన మేడ్చల్ పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కరుణాకర్ బహిరంగంగా విజ్ఞప్తి చేసాడు.

# మెడికవర్‌లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

**కరపత్రం ప్రతినిది కరీంనగర్ మే 30**
పొగాకు వాడకం కేవలం ఒక చెడు అలవాటు మాత్రమే కాదని, అది నెమ్మదిగా మనిషి ఆరోగ్యాన్ని కబళించే ప్రమాదకర విషమని వైద్యులు హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యులు పొగాకు, బీడీ, గుట్కా, తంబాకు వాడకం వల్ల కలిగే తీవ్ర ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్డియాలజిస్టు డాక్టర్ అనీష్ పబ్బ, జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ నాగరాజు, డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ పొగాకు వినియోగం నేరుగా గుండె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. బీడీ, సిగరెట్, గుట్కా వంటి అలవాట్లు రక్తనాళాలను దెబ్బతీసి గుండెపోటు, అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలకు దారితీస్తాయని వివరించారు. కొంతమంది ఒత్తిడి తగ్గించుకోవడానికి లేదా సరదాగా పొగ తాగడం ప్రారంభిస్తారని, కానీ అదే తర్వాత ప్రాణాంతక అలవాటుగా మారుతుందని చెప్పారు. నోటి క్యాన్సర్,




ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్న వారిలో అధిక శాతం మంది పొగాకు వినియోగదారులేనని తెలిపారు. ప్రస్తుతం యువతను లక్ష్యంగా చేసుకుని పొగాకు ఉత్పత్తుల తయారీ సంస్థలు ఆకర్షణీయ ప్రచారాలు నిర్వహించడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఫ్లేవర్స్ కలిపిన పొగాకు పదార్థాలు, కొత్త రూపాల్లో అందుబాటులోకి తీసుకురావడం వల్ల యువతతో పాటు చిన్నపిల్లలు కూడా వీటి వైపు ఆకర్షితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాషన్‌గా మొదలైన పొగతాగే అలవాటు చివరికి వ్యసనంగా మారి ఆరోగ్యాన్ని, ఆర్థిక పరిస్థితిని, కుటుంబ బంధాలను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. ఒక ఇంట్లో ఒక వ్యక్తి పొగతాగితే దాని ప్రభావం అతడికే పరిమితం కాదని, కుటుంబ సభ్యులపై కూడా తీవ్రంగా పడుతుందని హెచ్చరించారు. పొగతాగే వ్యక్తి విడుదల చేసే పొగను పీల్చడం వల్ల పిల్లలు, మహిళలు, వృద్ధులు, గర్భిణులు పరోక్షంగా అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం అధికమని వెల్లడించారు. చిన్నారుల్లో శ్వాసకోశ సమస్యలు, అలెర్జీలు, ఊపిరితిత్తుల ఇబ్బందులు పెరిగే అవకాశం ఉందన్నారు. బీడీ కార్మికులు కూడా అధిక సంఖ్యలో క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్న పరిస్థితి ఆందోళనకరమని అన్నారు. చెడు అలవాట్లను జీవితంలోకి రానివ్వకుండా యువత జాగ్రత్త పడాలని, ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని వైద్యులు పిలుపునిచ్చారు. మెడికవర్ సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, అబ్దుల్ వకీల్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుని కుటుంబానికి వ్యాళ్ల హరీష్ రెడ్డి ఆర్థిక సహాయం

**కరపత్రం ప్రతినిది గోదావరిఖని మే 30:**
రామగుండం కార్పొరేషన్ 57వ డివిజన్ గోదావరిఖని తిలక్ నగర్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు గులాబ్ ముస్తఫా(అబ్బు) ఇటీవల గుండె పోటుతో మరణించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి శనివారం పార్టీ నాయకులతో కలిసి గులాం ముస్తఫా ఇంటికి వెళ్లారు. కుటుంబాన్ని కలిసి సానుభూతి ప్రకటించారు. వ్యాళ్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని అన్నారు. ఇదే క్రమంలో ఆ కుటుంబానికి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని సూచించారు. ఫౌండేషన్ తరపున తన వంతుగా చేయూతను అందించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జహీద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, చొప్పరి శ్రీనివాస్, పర్ష స్వాతి, రాజకుమార్, కదర్ల శ్రీధర్, టాటా మ్యాజిక్ సది, సార్ల ఉదయ్, కొండ సురేష్, జక్కుల ప్రేమ్ కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మాసాయిపేట మండల కేంద్రంలోని ఆగ్రోస్ ఎరువుల దుకాణం ను అకస్మాత్తుకంగా తనిఖీలు నిర్వహించిన వ్యవసాయ శాఖ అధికారిని కవిత టస్కో ఫోర్స్. అధికారులు చేగుంట ఎస్సై చైతన్య రెడ్డి

**కరపత్రం ప్రతినిది వెల్దుర్తి మాసాయిపేట మే 30**
మెదక్ జిల్లామాసాయిపేట మండల కేంద్రం లో శనివారం నాడు అగ్రోస్ ఎరువుల దుకాణాన్ని ఏవో వి.కవిత ,చేగుంట ఏస్ఐ చైతన్య రెడ్డి టాస్క్ ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్, లైసెన్స్ కాపీ లు,బిల్లు బుక్ లు,విత్తననిల్వ లు ,ఎరువుల నిల్వలు పరిశీలించడం జరిగిందని ఎరువుల,విత్తన విక్రయాల్లో డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే రైతులకు రసీదు తప్పని సరిగా ఇవ్వాలని, బిల్లు పైన రైతు సంతకాలు తీసుకోవాలని, స్టాక్ బోర్డు,ధరల పట్టిక తప్పని సరిగా ప్రతి రోజూ రాయాలని యజమానికి వారు తెలియజేశారు.

# కాళేశ్వరంను పడావు పెట్టడం సరికాదు

లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు, ప్రజలకు పనికి రాకుండా పోయిందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ విమర్శించారు. ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించి కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్‌పై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే స్పష్టమైన నివేదిక ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దత్తాత్రేయ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు ప్రధాన బ్యారేజీల్లో ప్రస్తుతం నీరు లేకపోవడం ఆందోళనకర విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రత్యేక పూజలు, కేక్ కటింగ్‌తో సందడిగా నిర్వహణ -- ప్రజల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడు శ్రీధర్ బాబు: పెద్ది కుమార్

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట మే 30**

ఇల్లందకుంట మండల కేంద్రంలో రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా స్థానిక శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి కోసం మంత్రి శ్రీధర్ బాబు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

కార్యక్రమంలో మాట్లాడిన పెద్ది కుమార్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాజకీయ జీవితాన్ని కొనియాడుతూ ఆయన ప్రజల పట్ల చూపుతున్న అంకితభావాన్ని ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి నేటి తెలంగాణ రాష్ట్రం వరకు వివిధ హోదాల్లో ప్రజాసేవకు అంకితమై పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న నాయకుడు శ్రీధర్ బాబు అని పేర్కొన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు మరణానంతరం వారి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రతి సమస్యపై స్పందించే ప్రజానాయకుడిగా శ్రీధర్ బాబు ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.





తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో శ్రీధర్ బాబు విశేష పాత్ర పోషించారని పెద్ది కుమార్ అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను సేకరించి, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే మేనిఫెస్టో రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు.

తెలంగాణలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, యువతకు ఉపాధి, రైతుల సంక్షేమం, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధానాలు రూపొందించడంలో శ్రీధర్ బాబు చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.

జన్మదిన వేడుకల సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మంత్రి శ్రీధర్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమ ప్రాంగణం కాంగ్రెస్ పార్టీ జెండాలు, బ్యానర్లతో కళకళలాడగా కార్యకర్తల నినాదాలతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో కనుమల్ల సంపత్, గంగారం మహేష్, పెద్ది శివకుమార్, కొరకండ్ల శ్రీనివాస్, గుత్తికొండ రవికుమార్, మీసా రాజయ్య, జిల్లెల్ల సందీప్ రెడ్డి, మాడుదా తిరుపతిరెడ్డి, బైరెడ్డి కొండారెడ్డి, బండి మల్లయ్య, మర్రి వీరారెడ్డి, మూడేళ్ల రమేష్, బొమ్మ శ్రీనివాస్, కారింగుల రాజేందర్, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, గొడుగు మానస, గూడెపు ఓదెలు, ఆరే రమేష్ రెడ్డి, మారేపల్లి వేణు, గైకోటి రాజు, కేటిక తిరుపతిరెడ్డి, బోగం రాజేందర్, ధంసాని తిరుపతి, దారా నరేష్, మోత్కూరి శ్రీనివాస్, జిల్లెల్ల జలంధర్ రెడ్డి, కోడం శ్రీనివాస్, దాసరి తిరుపతిరెడ్డి, కాశమల్ల సతీష్, కాశమల్ల సాగర్, బొమ్మాడి సతీష్, నేరెళ్ల ఉదయ్, మర్రి సాయి, భోగం భగవత్, అన్నారపు సంతోష్, పుట్ట అనిల్, తెప్ప విజయ్, గాజా సాంబయ్య

# కాంగ్రెస్ బలోపేతానికి కేడర్ సమీకరణే లక్ష్యం

- గాంధీభవన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న హుజురాబాద్ ఇంచార్జి వొడతల ప్రణవ్

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్ మే 30**

హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య సమావేశంలో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడతల ప్రణవ్ పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం, గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేయడం, రానున్న రాజకీయ కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది.

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో సమర్థవంతమైన బూత్ ఏజెంట్లను నియమించడంతో పాటు, మండల స్థాయిలో మండల కమిటీలను, అనుబంధ విభాగాల కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని పార్టీ నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.






అనంతరం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయడానికి గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి సంబంధించి నాయకుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, పార్లమెంట్ కోఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, అసెంబ్లీ కోఆర్డినేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. హుజురాబాద్ నియోజకవర్గానికి చెందిన వొడతల ప్రణవ్ పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులతో చర్చించి, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# వీణవంకలో ఘనంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు 57వ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

**కరపత్రం ప్రతినిధి వీణవంక, మే 30:**

వీణవంక మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్లా శ్రీధర్ బాబు 57వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి శ్రీధర్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎక్కటి రఘుపాల్ రెడ్డి, ఎండీ సాహెబ్ హుస్సేన్, గంగాడి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ జిల్లా స్థాయి నాయకుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన శ్రీధర్ బాబు, అనంతరం డీసీసీ అధ్యక్షుడిగా, ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. రాష్ట్రానికి భారీ స్థాయిలో ఐటీ పెట్టుబడులను ఆకర్షించడంలో, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో, తెలంగాణ అభివృద్ధికి విశేష కృషి చేయడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు.



రాష్ట్ర రాజకీయాల్లో సమర్థవంతమైన నాయకుడిగా, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే ప్రజానాయకుడిగా శ్రీధర్ బాబు నిలిచారని వారు అన్నారు. అలాంటి నాయకుడి జన్మదిన వేడుకలను వీణవంక మండల కేంద్రంలో నిర్వహించడం తమకు ఆనందంగా ఉందని తెలిపారు. మండల ప్రజల తరఫున మంత్రి శ్రీధర్ బాబుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి, సర్పంచ్ జడల శ్రీకాంత్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు వావిలాల సత్యనారాయణ, కంకణాల జగదీశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిన్నాల ఐలయ్య, మ్యాక వీరయ్య, డైరెక్టర్ మాదాసు సునీల్, నాయకులు జున్నుతుల మధుకర్ రెడ్డి, ఒడ్డపల్లి కొమురయ్య, అలె మధుసూదన్, గుంటి రవీందర్, గ్రామ శాఖ అధ్యక్షులు ఒరేం శ్రీనివాస్, ఎల్కపల్లి లక్ష్మణ్, మద్ది అనిల్, గోటే రాజయ్య, అప్పని శ్రీనివాస్, రమేష్, మోటం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వివోఎస్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి: విమలక్క

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వివోఎస్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అరుణోదయ సాంస్కృతిక కళాకారుల సమైక్య నాయకురాలు విమలక్క కోరారు. శనివారం వేములవాడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వివస్ వోలు చేస్తున్న ధర్నా కార్యక్రమంలో ఆమె పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ గత 20--25 సంవత్సరాలుగా వివోఎస్ సిబ్బంది చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు రూ.5,000 వేతనం



ఏమాత్రం సరిపోవడం లేదని అన్నారు. ఈ విషయమై సిబ్బంది మంత్రి సీతక్కకు వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమలక్క ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వివోఎస్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని, వారి న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని కోరారు. అలాగే వారికి నెలకు రూ.20 వేల వేతనం అందించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పుట్ట చందమౌళికి ఘనంగా రిటైర్ మెంట్ సన్మానం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మే 30:**

ఓసీపీ -1 ఎస్ అండ్ డి సెక్షన్ లో గత 40 సంవత్సరాల నుండి అనేకమైన సేవలు అందించి శనివారం పదవి విరమణ పొందిన ఇపిజిహెచ్ పుట్ట చంద్రమౌళికి ఎస్ అండ్ డి సెక్షన్ అధికారులు సూపర్వైజర్లు, సహుద్యోగులు పదవి విరమణ పొందిన ఇపిజిహెచ్ పుట్ట చంద్రమౌళిని ఘనంగా సన్మానించారు. ఎస్ అండ్ డి సెక్షన్ హెచ్ఓడి నజీర్ అహ్మద్ మరియు సీనియర్ ఇంజినీర్స్, కొమురయ్య, మోహన్ రెడ్డి హాజరయ్యారు. అలాగె యూనియన్ నాయకులు ఏఐటీయూసీ నుండి ఎస్ అండ్ డి సెక్షన్ ఇంచార్జ్ బండ రాజ కొమురయ్య, అర్జయ్య, కొండప్ప, సదానందం, మేడ హరినాథ్, గురుకుంట్ల పోషం, ఐఎన్టీయుసి నుండి నరేండ్ల శ్రీనివాసరావు, సదానందం, కుమారస్వామి, నూతి శ్రీనివాస్, ఇతర ఉద్యోగులు వివిధ సంఘాల నాయకులు బిఎంఎస్ నుండి వడపల్లి కిరణ్ కుమార్, కోటగిరి రాము, సిఐటియు నుండి క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ ఇరుగురాల శ్రీనివాస్, సూరం శ్రీనివాస్ హాజరై చంద్రమౌళిని ఘనంగా సన్మానించారు.



## పెళ్లి రోజున.. సేవే మాధవ సేవ...

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మే 30:**

రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్, సామాజిక సేవకులు కొమురవెల్లి అరుణ-సుధాకర్ దంపతులు తమ పెళ్లిరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా రామగుండం రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి వారు సహకారం అందించారు. అలాగే నిరుపేద మహిళ సంధ్యారాణికి ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఉచితంగా కుట్టుమిషన్‌ను బహుకరించారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు కోలేటి శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు బండి చంద్రమౌళి, నిట్టూరి జీవన్ బాబు, ఎల్ఐసీ చిర్ర సంజీవరెడ్డి, చిట్టిమల్ల కిషోర్, చింతకింది కృష్ణ, కొమురవెల్లి రాహుల్ చేతుల మీదుగా సదరు మహిళకు కుట్టుమిషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కొమురవెల్లి అరుణ-సుధాకర్ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరు ఆకాంక్షించారు.



## వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**






వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సాధారణ సమావేశంలో 52 అజెండా అంశాలకు ఆమోదం లభించింది. ఫంక్షన్ హాళ్లలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగంపై నిషేధం విధించగా, 203 మంది పారిశుధ్య కార్మికులకు రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించాలని నిర్ణయించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల పూడికతీత, రోడ్ల మరమ్మతులు, పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని కౌన్సిల్ తీర్మానించింది. పట్టణంలో చెత్త వేయకుండా 500 సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, కోనో కార్పస్ చెట్ల స్థానంలో పూలు, నీడనిచ్చే మొక్కలు నాటాలని నిర్ణయించారు. జేసీబీ కొనుగోలు ప్రతిపాదనను రద్దు చేసి, చెత్త సేకరణ కోసం నాలుగు ట్రాలీ ఆటోలను కొనుగోలు చేయడానికి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడను ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ జి.లోకేష్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఐటీయూ 57వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

**వేములవాడ, కరపత్రం ప్రతినిధి**

వేములవాడ పట్టణ మున్సిపల్ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ 57వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నెల రోజుల పాటు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్మికులను శాశ్వతీకరించడం, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయడం, స్కిల్ వేతనాలు చెల్లించడం తదితర డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సరిపెల్లి నరేష్, రాష్ట్ర నాయకులు కీసరి శ్రీనివాస్, జిల్లా నాయకులు కావాలా సత్తయ్య, బొడ్డు శీనువాస్, పిట్టల శంకర్, సుంకపాక పరశురాములు, శంకర్, వావిలాల మమత, మనిషా, తోట శంకరవ్వ, ఎల్లవ్వ తదితరులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

